## క్లుప్తంగా

### విద్యార్థినికి ఎస్పీ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : కష్టంతో కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఆ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎస్పీ కె.నరసింహ అన్నారు. పట్టణానికి చెందిన అనుముల సాయిమాధురి ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ జన్మస్థలమైన వాదనగరంలో జరిగిన జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొని విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినికి గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శాలువా కప్పి ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

### ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దాయం ఝాన్సీరాజిరెడ్డి

తుంగతుర్తి : విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని దాయం రాజిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన సందర్భంగా గురువారం ఆమె ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చేలా పాఠశాల దశ నుంచే విద్యార్థులను మంచి విద్యాబోధనతో భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో ఇక్కడ ఉపాధ్యాయుల కృషి దాతల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గానుగబండ మాజీ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, వెంపటి మాజీ ఉపసర్పంచ్ భాషబోయిన వెంకన్న, పాఠశాల హెచ్‌ఎం అల్వాల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు భాస్కర్, సహదేవ్, కొండగడుపుల యాకయ్య, రవికుమార్, రాజన్న, రాజు, నవీన్, ప్రసాద్, లావణ్య పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

నాగారం : విద్యార్థులు దాతల సహకారంతో ఉచితంగా అందించే నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ బలగాని సరస్వతిశ్రీనివాస్ సహకారంతో విద్యార్థులకు రూ.10వేల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రిబాక్స్‌లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.మంజుల, ఉపాధ్యాయులు గుండేటి లక్ష్మణరావు, సుజాత, ఏఏపీసీ చైర్మన్ కడారి శోభ, మాజీ సర్పంచ్ యానాల నరసింహారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న శివయ్య

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ధరావత్ శివయ్య అన్నారు. గురువారం పెద నెమిల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నీరజ ఆర్థిక సహకారంతో 45మంది విద్యార్థులకు టై, బెల్టు, నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయురాలు చంద్రశేఖర్‌రెడ్డి, రజిత, సీఆర్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని ఎంఈఓ బాలునాయక్, మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ కోరారు. అర్వపల్లిలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ప్రచారం చేశారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యం.యాకలక్ష్మి, ఉపాధ్యాయులు రేణుక, స్వరూపరాణి, శైలజ, స్థానికులు, బండగొర్ల అనురాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తరలిస్తున్న దళారులు
- ఒక్కో టిప్పర్‌కు రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయాలు



తొండ చెరువులో మట్టి ఎత్తుతున్న జేసీబీ



మట్టి తరలింపుతో చెరువులో ఏర్పడిన గుంతలు

తిరుమలగిరి : అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టి తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తిరుమలగిరి మండలంలోని పలు గ్రామాలలో చెరువులు, కుంటలలో నిబంధనలకు విరుద్ధంగా జేసీబీల ద్వారా తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. తొండ గ్రామంలోని చెరువులో గత కొద్ది రోజులుగా జేసీబీల సహాయంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. చెరువు మట్టిని లూటీ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా జేసీబీలతో ఇష్టానుసారంగా తవ్వుతూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ప్రైవేట్ పనులకు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు కేవలం మొక్కుబడిగా వచ్చి మట్టిని తవ్వొద్దని చెప్పి వారు విదిల్చే కాసులకు కక్కుర్తి పడుతూ వెళ్తున్నారు. కొన్ని రోజులు మట్టి తవ్వకాలు నిలిపి వేసి తిరిగి షరా మామూలే అన్నట్లుగా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**ఆందోళనలో మత్స్యకారులు..**

చెరువులు, కుంటలలో 20నుంచి 30అడుగుల లోతు మట్టి తోడేస్తున్నారు. దీంతో చెరువు ఆనవాలే కోల్పోతుంది. ఈ చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇష్టానుసారంగా మట్టి తవ్వడంతో ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉందని వాపోతున్నారు. మట్టి తవ్వకాలతో చెరువులో పెద్దపెద్ద గోతులు ఏర్పడి నీళ్లు నిల్వడానికి అవకాశం ఉంది. చేపలు పట్టే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వారు వాపోతున్నారు. గతంలో గుంతలలోపడి చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. దళారులు ఒక్కో టిప్పర్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ప్రైవేట్ వ్యక్తులకు మట్టిని అమ్ముతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వానికి లక్షలాది రూపాయల ఆదాయం పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు**

అనుమతులు లేకుండా మట్టిని ఎట్టి పరిస్థితుల్లో తరలించడానికి వీలు లేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తొండ చెరువులో మట్టి తీయకుండా నిలిపివేశాము. అనుమతులు లేకుండా ఎవరైనా మట్టి తరలిస్తే కేసులు నమోదవుతాయి.

– చంద్రశేఖర్, ఇరిగేషన్ జేఈ

## పదేళ్ల పాలనలో ప్రజాధనాన్ని కొల్లగొట్టారు

- ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాధనాన్ని మొత్తం కొల్లగొట్టారని ఎమ్మెల్యే మందుల సామేల్ విమర్శించారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో కుటుంబ పాలన సాగిందని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావు, కవితలు రాష్ట్ర బడ్జెట్‌లో సగం లాగేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు 600మందిపై ఫోన్‌ట్యాప్ చేశారని, వారు చట్ట ప్రకారం శిక్షించబడతారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. టీఆర్‌ఎస్ పేరు నుంచి బీఆర్‌ఎస్‌గా ఎప్పుడు మారిందో ఆ పార్టీ పని అప్పుడే పోయిందన్నారు. నియోజకవర్గాన్ని సీఎం, మంత్రుల సహకారంతో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, అవిలుమల్లు, సుధాకర్‌రెడ్డి, జమ్మిలాల్, వీరేష్, వేణురావ్, రాపాక సోమేష్, అంబేడ్కర్, నర్సింహారెడ్డి, యాదగిరి, వంశీ, అబ్బాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో దేశ భద్రత బలోపేతం

గరిడేపల్లి : మోదీ పాలనలో దేశ భద్రత బలోపేతమైందని, ఆర్థిక వ్యవస్థ స్థిరత సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలైన స్వచ్ఛ భారత్, పీఎం కిసాన్, ఉజ్వల యోజన, జనధన్, ముద్రా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పథకాల ప్రభావం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుర్చాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ సంకల్ప సభ ఇన్‌చార్జ్ సాధినేని శ్రీనివాస్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, నర్సింగ్ అంజయ్య, జనిగల శ్రీనివాస్, అంజయ్య ఉన్నారు.

## పట్టణాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సూర్యాపేట : ర్యాలీలో పాల్గొన్న వేణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, విద్యార్థులు

సూర్యాపేట : పట్టణాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో 100రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం 17వ వార్డులోని చింతలచెరువులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రగతి కొత్త దిశలో సాగుతోందన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, టీఎంసీ శ్వేత, వార్డు అధికారి నాగార్జున, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, మాజీ కౌన్సిలర్ బైరబోయిన శ్రీను పాల్గొన్నారు.

**పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి**

సూర్యాపేట టౌన్ : ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సూర్యాపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు గోల్డెన్ బాయ్స్ ఆధ్వర్యంలో గురువారం మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.లక్ష, రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.50వేలు, మూడో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.20వేల నగదు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్ షూ అందజేస్తానన్నారు. అనంతరం 2024–25లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేసిన సుగుణ జ్ఞాపకార్థం వారి కుమారుల చేతులమీదుగా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని మహాలక్ష్మికి రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోలి పద్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక



ఆత్మకూర్ (ఎస్) : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వతరగతి ప్రవేశానికి గాను మండలం నుంచి 20మంది విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం జ్ఞానేశ్వరచారి, ఫిజికల్ డైరెక్టర్‌లు యాకయ్య, సీహెచ్ కృష్ణమూర్తి, కె.రమేష్, సీఆర్పీ హరిప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని స్పోర్ట్స్ పాఠశాలలో 4వతరగతిలో ప్రవేశానికి గాను గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధారాసింగ్ మాట్లాడారు. స్పోర్ట్స్ పాఠశాలల్లో చేరడానికి మండల వ్యాప్తంగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 25న జిల్లా స్థాయిలో ఎంపిక పోటీల్లో పాల్గొనాలని, అనంతరం రాష్ట్ర స్థాయిలో కూడా సెలక్షన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వి.శ్రవణ్‌కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వనజ, రవి, లింగయ్య శ్రీదేవి, వసంత, హెలెన్, విద్యార్థులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూర్ (ఎస్): ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్ (ఎస్): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎం నిర్మల అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని నసీంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దోమలతో మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇళ్లలో పాత కుండలు, పాతటైర్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.ఎమ్మెలియా, ఎస్.చంద్రారెడ్డి, మధుకుమార్, నాగు, జ్యోతి, విజయలక్ష్మి, ఏఎన్‌ఎం ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు, వైద్యాధికారి భవానీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డయేరియా బారిన పడిన పిల్లలను గుర్తించి, ఆశావర్కర్లు వారి ఇళ్లకు వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కమల తదితరుల పాల్గొన్నారు.

**అతిసార వ్యాధి నివారణకు కృషి చేయాలి**

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని అతిసార వ్యాధి నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారి ప్రవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్న పిల్లలకు నీళ్ల విరోచనాలు అయినప్పుడు ఓఆర్‌ఎస్ ద్రావణం ప్రతిసారి తాగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్, ఏపీఓ రవి, కార్యదర్శి నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిఫా, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవంతి

## కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



తిరుమలగిరిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



సూర్యాపేట : కేక్ కట్ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

తిరుమలగిరి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, వేణురావ్, రాపాక సోమేష్, అంబేడ్కర్, ఎర్ర యాదగిరి, మూల రవీందర్‌రెడ్డి, అబ్బాస్, డానియల్, రాములు, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

**ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం**

సూర్యాపేట : దేశంలోని సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని డీసీసీ కార్యాలయం (రెడ్ హౌస్)లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అంజద్‌అలీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణారెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సేవాదళ్, అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి వైజంక్షన్‌లో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ నేత, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ బి.సైదులు, దల్వాయి శ్రీధర్, బి.మహరాజు, ఎ.సైదులు, జాల నర్సయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు గౌడ్, బద్దం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో గురువారం డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, కొమ్ము జోహార్, ఎలిమినేటి అభినయ్ నరేష్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు దొంగరి గోపి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడ్డి కేశవులు పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జూకూరి గాంధీ, అంజయ్య, వీరయ్య, నాగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలో మహిళా బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు పచ్చిపాల సుమతీ వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చామకూరి శ్రీనివాస్, రమేష్, ఉమేష్, నసీర్‌ఖాన్ పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలో ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కొమ్ము జోహార్, రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

నాగారం : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు నాగారం ఎక్స్‌రోడ్డులో కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోడుసు లింగయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె.యాకుబ్‌వలి, నాతి వీరమల్లుగౌడ్, కన్నెబోయిన వెంకటభిక్షం, వెంకన్న, దశరథ, భాను పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్ననాయక్, మనోహర్, అమ్మి, మంగ్తా, లాలు, యాదగిరి, చందు, వీరన్న, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



అర్వపల్లి పీహెచ్‌సీలో యోగా సాధన చేస్తున్న డాక్టర్, సిబ్బంది

అర్వపల్లి : ఈ నెల 21న గ్రామగ్రామాన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో కలిసి యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా, ధ్యానంతో అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ అధికారిణి సునిత, నర్సింగ్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

తాళ్లగడ్డ (సూర్యాపేట) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కారింగుల ఉపేందర్ అన్నారు. గురువారం పట్టణంలో విశ్వహిందూ పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆ స్కూల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మనస్సును, శరీరాన్ని అదుపులో ఉంచుకుంటే చదువులో, జీవితంలో ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

సూర్యాపేట అర్బన్ : ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపుతున్నాయని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు అనేక కోచింగ్ సెంటర్ల పేరుతో నవోదయ గురుకులం సైనిక్ పేర్లతో ఒలంపియాడ్, ఐపీఎల్, గ్లోబల్, ఐసీఎల్ ఇంటర్నేషనల్ సీబీఎస్సీ గ్లోబల్స్ అనే ఆకర్షణీయమైన పేర్లతో మాయ చేస్తూ, యూకేజీ నుంచి పదోతరగతి వరకు విద్యార్థుల నుంచి పుస్తకాలు, టై, బెల్ట్‌లు, డ్రెస్‌లు, మరెన్నో పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. జిల్లా విద్యాధికారులు అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై, సంబంధిత యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు మామిడి పుల్లయ్య, అర్వపల్లి లింగయ్య, కప్పల సత్యం, మాధగోని మల్లేష్, ఒట్టే ఎర్రయ్య, శిరేఖ, జయమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాంబాబు

ఆత్మకూర్ (ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సెక్టోరియల్ అధికారి వై.రాంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని కోటపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయాలని, నాణ్యమైన వస్తువులు వాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కిష్టయ్య, ఉపాధ్యాయులు పుల్లయ్య, రమాకాంత్ పాల్గొన్నారు.

### ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

తుంగతుర్తి : బీఆర్‌ఎస్ శ్రేణులు స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రైతు భరోసా ఇచ్చి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ఆలోచన చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు గుండగాని రాములుగౌడ్, మనోజ్, శ్రీనివాస్, శంకర్‌నాయక్, శ్రీను ఉన్నారు.

### బెంచీల బహూకరణ

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కుదుర్ల లక్ష్మీశ్రీనివాస్ రూ.25వేల విలువగల ఐదు బెంచీలను గురువారం బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బండారు శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.



బెంచీలు బహూకరిస్తున్న దాత లక్ష్మీశ్రీనివాస్

## సీఎం స్పందించలేదనడం హాస్యాస్పదం

అర్వపల్లి : బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడంలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. అర్వపల్లిలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా హక్కుల కోసం పోరాడుతుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీఎం రేవంత్‌రెడ్డి వేగవంతమైన, స్పష్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ కవిత బాధ్యతారాహిత్యంగా, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడడం తగదన్నారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణకు సీఎం వెంటనే అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం జరిపారని, బనకచర్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు.

### బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

తిరుమలగిరి : బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జానయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆయన రచించిన పాడిన సీడీని గురువారం పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దామర శ్రీనివాస్, రాంపల్లి యాదగిరి, సోమయ్య, ఉపేంద్ర, వెంకన్న, బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

### రామన్న త్యాగం మరువలేనిది

సూర్యాపేట అర్బన్ : ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజలకు అండగా నిలబడిన బాదే రామన్న త్యాగం మరువలేనిదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. బాదే రామన్న వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాము జిల్లాలో రైతాంగ ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ రైతాంగ సమస్యల సాధనకై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పోలేబోయిన కిరణ్, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, దేసోజు మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు బడి.. సమస్యల ఒడి

**అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలలు**

- అరకొర వసతులతో ఆరుబయటే చదువులు
- తగినన్ని మరుగుదొడ్ల లేక పాట్లు
- విద్యార్థులు లేక కొన్నిచోట్ల మూత
- తాగునీటికీ ఇబ్బందులే

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శిథిల భవనాలు.. అరకొర వసతులు.. తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత.. వెరసి అనేక సమస్యలతో బడులు కునారిల్లుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. మధ్యాహ్న భోజనం తయారీకి వంట గదులులేక ఆరు బయట చేయాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా గదులు లేక చెట్లకిందే భోజనం చేయడమేకాకుండా చదువులు కొనసాగించాల్సి వస్తోంది. చాలా చోట్ల ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేక స్కూళ్లు మూతపడ్డాయి. మన ఊరు– మనబడి పథకం కింద చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గురువారం 'సాక్షి' విజిట్‌లో పలు సమస్యలు వెలుగు చూశాయి.

## మూత్రం వస్తే ఉగ్గబట్టాల్సిందే..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలల్లో నీటి సౌకర్యం కూడా లేదు.



మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు



శిథిలావస్థకు చేరిన జగత్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## మూడు తరగతులు.. ఆరుగురు విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జగత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల భవనం 15 ఏళ్లుగా పడావుగా ఉంది. తలుపులు, కిటికీలు విరిగి శిథిలావస్థకు చేరింది. దాంతో గ్రామంలోని యువజన సంఘం భవనంలో తాత్కాలిక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం గ్రామంలో బడిబాట, గ్రామసభ పెట్టి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, తాము సైతం ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన చేస్తామని చెప్పినా ఒక్కరూ కూడా చేరలేదు. గత సంవత్సరంలో వచ్చిన ఆరుగురు విద్యార్థులు పైతరగతికి వచ్చారు. 1వ తరగతిలో ఇద్దరు, రెండో తరగతిలో ఒక్కరు, మూడో తరగతిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు ఉన్నారు.



కనీస సౌకర్యాలు లేక నేలపైనే బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

## వసతులు, విద్యార్థులూ.. అరకొరే



గుంటిపల్లి పాఠశాలలో ఐదు తరగతులకు హాజరైన ఆరుగురు విద్యార్థులు

నిడమనూరు : నిడమనూరు మండలంలోని పలు పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నాయి.. విద్యార్థులు కూడా తక్కువ సంఖ్యలోనే ఉన్నారు. 33 ప్రాథమిక పాఠశాలల్లో 896 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరుచోట్ల విద్యార్థుల సంఖ్య సున్నాకు చేరింది. గగినపల్లివారిగూడెం, రాజన్నగూడెం, కుంటిగొర్లగూడెం గ్రామాల్లో పదికంటే తక్కువ మంది ఉన్నారు. వేంపాడు పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క ఉపాధ్యాయురాలే ఈరోజు విధులకు హాజరయ్యారు. ఎర్రబెల్లి పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఈరోజు ఇద్దరే హాజరయ్యారు. గుంటిపల్లి పాఠశాలో ఐదు తరగతులకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు.

## శిథిలమైన మూత్రశాలలు

మోత్కూరు : మోత్కూరు మండలం దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ విద్యార్థులకు ప్రమాదకంగా మారింది. 6 నుండి 10వ తరగతి వరకు 54 మంది విద్యార్థులు ఉన్నారు. 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో మూత్రశాలలు శిథిలమయ్యాయి. దీంతో బాలురు పాఠశాల చెరువులో ఉన్న చెట్ల మాటున మూత్ర విసర్జనకు వెళతారు. స్పెషల్ డెవలప్‌మెంట్ కింద రూ.8 లక్షలు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు చేశారు. గత సంవత్సరం కాంట్రాక్టర్ టాయిలెట్స్ నిర్మాణం కోసం పునాది గుంతలు తవ్వి అర్ధాంతరంగా వదిలేశారు.



దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలమైన టాయిలెట్స్.

## కురుస్తున్న తరగతి గది స్లాబ్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారాంపురం(షాబునగర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా 16మంది పిల్లలున్నారు. ఆ పాఠశాలలో రెండు గదులతో పాటు ఒక ఆఫీస్ ఉంది. అయితే వర్షం వచ్చిందంటే స్లాబ్ నుంచి వర్షపు నీరు గోడల వెంట తరగతి గదుల్లోకి చేరుతుంది. ఆ పాఠశాలలో మంచినీటి సమస్య, మూత్రశాలలు, మరుగుదోడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వర్షం వచ్చిందంటే మాత్రం ఈ పాఠశాల చుట్టూ వర్షపునీటితో కమ్ముకుంటుంది.



సీతారాపురం ప్రాథమిక పాఠశాలలో గోడల నుంచి వస్తున్న వర్షపునీరు

## రైతు వేదికలో తరగతుల నిర్వహణ



దిర్శనపల్లి రైతు వేదికలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నూతనకల్: మండల పరిధిలోని దిర్శనపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అదే గ్రామంలోని రైతు వేదికలో తరగతులను నిర్వహిస్తున్నారు. రైతుల అవసరాల కోసం నిర్మించిన రైతు వేదిక పాఠశాలగా మారడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## తరగతి గదులు సరిపడా లేవు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మొత్తం 10 తరగతి గదులు అవసరం కాగా 8 తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో వరండాలో ఒక తరగతిని, డైనింగ్ హాల్లో మరో తరగతి వారిని కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇదే పాఠశాల అవరణలో మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే 4 తరగతి గదులు ఉన్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు, గోడలు కూలిపోతున్న గదులు 8 వరకు ఉన్నాయి. వీటిని పూర్తిగా తొలగించకపోవడం వల్ల ఆ పాఠశాల ఆవరణలో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.



శిథిలావస్థకుచేరి కూలిపోతున్న గదులు



మరమ్మతులకు నోచుకోని గదులు



పెచ్చులు ఊడుతున్న తరగతిగది పైకప్పు



శేరిగూడెం పాఠశాలలో విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడు

## విధుల్లో టీచర్.. కనిపించని పిల్లలు

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండలం శేరిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రావడం లేదు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు నిత్యం విధులకు హాజరై సమయం ముగిశాక ఇంటికి వెళ్తున్నారు. ఐదారేళ్లుగా విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రయత్నం చేయడం.. విద్యార్థులు రాకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు పంపుతున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించమని వేడుకున్నా తల్లితండ్రులు మాత్రం వినడం లేదని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## శిథిలావస్థలో చెరువు అన్నారం పాఠశాల

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శిథిలాస్థలో ఉన్న భవనంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా తరగతి గదులు లేక ప్రధానోపాధ్యాయుడి గదిలో కూడా పాఠాలు బోధిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితమే భవనం కూల్చాలని ఆదేశాలు వచ్చినా నేటికీ కూల్చలేదు. పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న 5 తరగతి గదులు స్లాబ్, గోడలు పూర్తయ్యాయి. నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు.



శిథిలావస్థలో ఉన్న చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల

**విద్యార్థులు తక్కువ ఉపాధ్యాయులు ఎక్కువ**

చెరువు అన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులతో కలిసి మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారు. పాఠశాలలో 68 విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా అదనంగా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.

## అసంపూర్తి భవనాల్లోనే చదువులు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పూర్వకాలం నాటి భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు. ఈ మేరకు పాఠశాల పాత గదులను కూలగొట్టి నూతనంగా నిర్మాణాన్ని చేపట్టారు. స్లాబ్ వేసినా పైసా బిల్లు అందకపోవడంతో కంట్రాక్టరు నిర్మాణాన్ని నిలిపివేశాడు. ఇంతలో ప్రభుత్వం మారడంతో మన ఊరు– మన బడి పథకాన్ని పక్కకు పెట్టారు. దీంతో రెండేళ్లుగా భవన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోగా తరగతి గదులు లేక గోడలు లేని స్లాబ్ క్రిందనే తరగతి గదిని నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు టీచర్లు, 30 మంది విద్యార్థులు ఉన్నారు. కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కూడ ఉన్న తరగతి గదిని కూల్చివేసి కొత్త గది నిర్మాణం చేపట్టగా స్లాబ్ వేసిన కంట్రాక్టరుకు బిల్లులు రాక అంపూర్తిగా వదిలేశాడు.



గుర్రంపోడులో రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన గోడలు లేని భవనంలోనే పాఠాలు

## టీచర్ ఒక్కరే.. విద్యార్థులు లేరు

ఆలేరురూరల్ : ఆలేరు మండలం గుండ్లెగుడెం గ్రామంలో ప్రభుత్వ పాథమిక పాఠశాలలో 2013 సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా వారు వెళ్లిపోవడంతో ప్రాథమిక పాఠశాల మూతపడింది. తిరిగి 2018 సంత్సరంలో ప్రారంభించి ఒక ఉపాధ్యాయురాలిని నియమించారు. గత ఏడు సంవత్సరాలుగా ఒక్క విద్యార్థి కూడా బడిలో చేరలేదు. ఒక్క టీచర్ మాత్రమే స్కూల్‌కు హాజరవుతున్నారు. ఇంటింటికి తిరిగి బడిలో చేరమని చెప్పినా పిల్లలను తల్లిదండ్రులు చేర్పించడం లేదు. ఆలేరు పట్టణం పక్కనే ఉండడంతో దాదాపు 50 మంది పైనే పిల్లలు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు.



గుండ్లెగుడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయురాలు

## ఒకే గదిలో ఐదు తరగతులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలో బాకిగూడెం, బెండల్‌పహాడ్, జువ్విగూడెం పాఠశాలలో విద్యార్థులు లేరు. ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారు, నక్కలపల్లి హైస్కూల్‌లో బాలికలకు బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవు. మండల కేంద్రంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది మాత్రమే ఉంది. ఆ గదిలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 47 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. కొందరికి చెట్లకిందనే పాఠాలు చెబుతున్నారు. నూతన భవనం మంజూరైనా పనులు చేపట్టలేదు. పాఠశాలలో బాత్‌రూమ్‌లకు డోర్లు లేకపోవడంతో టీచర్‌లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



ఒక గదిలోనే తరగతులు నిర్వహిస్తున్న టీచర్‌లు

## ఒక్కరే టీచర్.. నలుగురు విద్యార్థులు

యాదగిరిగుట్ట: మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే మహిళా టీచర్ ఉన్నారు. ఈ పాఠశాలలో గురువారం నలుగురు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఉండగా నలుగురు పాఠశాలకు రావడం లేదు. ఒకే టీచర్ అన్ని తరగతులకు బోధిస్తోంది. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు ఉద్యోగ విరమణ చేసి వెళ్లిపోయారు.



మహబూబ్‌పేట గ్రామంలో నలుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

**బాత్రూమ్‌లు లేక అవస్థలు:** మండలంలోని మల్లిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 11 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు బాత్రూమ్‌లు లేక అవస్థలు పడుతున్నారు. ఒకే ఒక బాత్రూమ్ మాత్రమే ఉంది. ఈ బాత్రూమ్ కేవలం అమ్మాయిలకు మాత్రమే ఉంది.

## విద్యార్థులు చేరలే..

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగలేదు. ఏడు తరగతులకు మొత్తం 20మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో సౌకర్యాలు కూడా అరకొరగా ఉన్నాయి. వంటగది రేకులను కోతులు ధ్వంసం చేశారు. దీంతో ఎండలోనే భోజనం వండుతున్నారు. తాగునీరు కూడా లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి విద్యార్థులు పాఠశాలలో చేరలేదు.



మండలాపురం పాఠశాలలో కొద్దిమంది విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

## శిథిలమైన గదులు

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా.. 20 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. మెత్తం మూడు గదులకు గాను ఒక గది పూర్తిగా శిథిలమై నిరుపయోగంగా ఉంది. మరో రేకుల గది కుడా శిథిలావస్థకు చేరింది. మిగిలింది ఒక్క గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.



మానాయికుంటలో శిథిలావస్థకు చేరిన పాఠశాల గది

## ఒక్కడే సారూ.. ఒక్కరూ లేరు..

చందంపేట : చందంపేట మండలంలోని మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు.. విద్యార్థులు మాత్రం ఒక్కరు కూడా లేరు. గతంలో ఈ పాఠశాల మూతపడగా.. విద్యార్థులను మళ్లీ పాఠశాలకు రప్పించాలనే ఉద్దేశంతో పాఠశాలను పునః ప్రారంభించారు. అయినప్పటికీ ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు.



మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయుడు శ్రీనివాస్

## అయిదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు



ఒకటవ, రెండవ తరగతి విద్యార్థులకు కలిపి బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కూరెల్ల ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులు అయిదు తరగతులను బోధించాల్సి ఉంది. ఒక గదిలో రెండు తరగతులకు చెందిన విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు ఒక రోజు.. మరుసటి రోజు మరో తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

## 16 పాఠశాలలు మూత

పెద్దవూర: మండలంలో విద్యార్థులు లేరనే కారణంతో గత విద్యా సంవత్సరం 18 పాఠశాలలు మూతపడగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో 16 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శూన్యం. ఇందులో 11 గిరిజన తండాలలోని ప్రాథమిక పాఠశాలలే ఉండటం గమనార్హం. మండలంలో మొత్తం 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

**మూతబడిన పాఠశాలలు ఇవే..**

ఎంపీపీఎస్ గేమ్యానాయక్‌తండా, పాత జయరాంతండా, కొత్త జయరాంతండా, జగ్రాంతండా, మల్లేవానికుంటతండా, లింగంపల్లి, కొత్త జయరాంతండా, రామన్నగూడెంతండా, చింతపల్లితండా, జీపీఎస్ లేబర్ కాలనీ పైలాన్, సుద్దబావితండా, నాయినివానికుంట తండా, నాయినివానికుంట, రామన్నగూడెం, కోమటికుంటతండా, పాత జయరాంతండా ప్రాథమిక పాఠశాలలతో పాటు యూపీఎస్ కెనాల్ ఉర్దూ మీడియం, యూపీఎస్ కెనాల్స్ తెలుగు మీడియం పాఠశాలలు మూత బడ్డాయి. మూత పడిన పాఠశాలు మొత్తం 16 ఉండగా ఇందులో గిరిజన తండాలలో మూతపడినవి 11 ఉండటం గమనార్హం. దీంతో గిరిజన తండాలలో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 18 పాఠశాలలు మూతపడగా ఈ ఏడాది మల్లిపురి, సుద్దబావితండా ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.



పెద్దవూర: విద్యార్థులు లేక మూతబడిన నాయినివానికుంటతండా పాఠశాల

## 38మందికి రెండు గదులు మాత్రమే..

బొమ్మలరామారం: మండలంలోని తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో 5 తరగతుల్లో 38 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ కలిసి రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో రెండు గదుల్లోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌రూం లేక ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మైసిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలో 1వ తరగతిలో నలుగురు, మూడో తరగతిలో ఇద్దరు, నాల్గో తరగతిలో ఒక విద్యార్థి ఉన్నారు. రెండు, ఐదు తరగతుల్లో విద్యార్థులులేరు.



తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో కూర్చున్న మూడు తరగతుల విద్యార్థులు

## కనీస సౌకర్యాలు కరువు

నాగారం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉండగా.. ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయులే మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారేళ్ల క్రితం వంట గది నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో ఒక తరగతి గదిని వంట కోసం కేటాయించారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరూపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నాగారంలోని ప్రాథమిక పాఠశాలలో వంట చేయడానికి కేటాయించిన తరగతి గది